క్లుప్తంగా

ఆశ్రమంలో నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చిన కోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం 96వ నేత్ర పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రమం అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మొత్తం 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశామని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ, రచయిత గోలి మధు, పిరమిడ్ ధ్యాన ప్రచారకుడు కొసనం శ్యామలరావు, రావుల అమృతాచారి పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నీ



తాడేపల్లిరూరల్: పెనుమాక గ్రామంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. విలేకరులతో ఆదివారం టోర్నమెంట్ నిర్వాహకుడు కళ్లం గోవిందరెడ్డి మాట్లాడారు. మొత్తం 64 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొనగా.. ఆదివారం 8 టీమ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయని వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఐశ్వర్య 786 జట్టు, యూసీ11 జట్టుపై విజయం సాధించిందని తెలిపారు. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన ఐశ్వర్య 786 క్రికెటర్ అనంత చింటుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కళ్లం గోవిందరెడ్డి, అంపైర్ గరుగు సుబ్బారెడ్డి అందజేశారని తెలిపారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో చిరు వ్యాపారులకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో మూడు తోపుడు బండ్లను ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు మేకా వెంకటరామిరెడ్డి, నాయకులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనీల్, బత్తుల దాసు, సయ్యద్ రసూల్, సంపూర్ణ పార్వతి, కె.అజయ్, టి.వికాస్, బి.శ్రావణ్, సుధాకర్, ఆరిఫ్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్ ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహక సభ్యులు భీమవరపు దశరథరామిరెడ్డి మాట్లాడారు. సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకునేందుకు పోటీ పడాలని కోరారు. మొదటి రోజు కోటేశ్వరరావు మాస్టర్ సైన్స్, పద్మావతి టీచర్ నీతి కథలు, దేశ నాయకుల జీవిత విశేషాలను వివరించారని తెలిపారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు ఆర్‌వీ రాఘవయ్య, క్లబ్ నిర్వాహకులు సోలా ముత్యాలరావు, యనమాల బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తన గురువు వసుంధరకు సత్కారం

తెనాలి: అన్నమాచార్య కీర్తనల ప్రచారంలో కొనసాగుతున్న తెనాలికి చెందిన సంకీర్తన గురువు కొండపి వసుంధరను ఆదివారం స్థానిక వైకుంఠపురం దేవస్థానంలో సత్కరించారు. పట్టణానికి చెందిన శ్రీసత్యనారాయణ భజన మండలి ఆధ్వర్యంలో ఈ సత్కారం చేశారు. అన్నమయ్య కీర్తనలను ఉచితంగా నేర్పటమే కాకుండా తమను తిరుమల నాదనీరాజనం మండటం, ఒంటిమిట్ట, తాళ్లపాకలో సంకీర్తన చేయించటం, వైకుంఠపురంలోని బ్రహ్మోత్సవాల్లోనూ అవకాశం ఇచ్చినందుకు శిష్యబృందం, తమ గురువును సత్కరించుకుంది. అనితమాధవి, మారా లలితకుమారి, గుబ్బా లక్ష్మీకుమారి, కంభంపాటి లీలారత్నకుమారి, చౌట నాగమల్లేశ్వరి, దేవిలలిత, తాడేపల్లి సూర్యనాగమల్లేశ్వరి పర్యవేక్షించారు. నృత్యగురువు జి.నిర్మల రమేష్, సురాబత్తుల కేశవరావు, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాయుపుత్ర..అభయాంజనేయ

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు
- విజయకీలాద్రిపై స్వామికి క్షీరాభిషేకం
- ఆలయాల్లో పంచామృత అభిషేకాలు
- వేలాదిగా స్వామిని దర్శించుకున్న భక్తులు



విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలో భక్తులు



విశేష అలంకరణలో అభయాంజనేయ స్వామి



విజయకీలాద్రిపై ఆంజనేయ స్వామికి క్షీరాభిషేకం



స్వామిని దర్శించుకున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి, మల్లేశ్వరరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళగిరి నాలుగు కాళ్ల మండపంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రజలకు హనుమజ్జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భక్త బృందం ప్రతినిధులు మాగం దుర్గారావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు. మంగళగిరి మిద్దె సెంటర్‌లోని ప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు దగ్గుపాటి సాంబశివరావు స్వామికి పంచామృతాభిషేకం, తమల పాకులు, సిందూర అర్చన చేశారు. అన్నదానం చేశారు.

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మంగళ శాసనాలతో హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామికి అభిషేకం, సర్వగ్రహ దోషనివారణ, మనో ధైర్యసిద్ధి, వాక్చాతుర్యం కొరకు మన్యుసూక్త హోమం, అష్టోత్తం, వడమాల సేవ, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు. విజయవాడ కనకదుర్గ దేవస్థానం దత్తత శ్రీ కోదండరామస్వామి ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి అధికారులు ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. చెట్టుకింద ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూరు బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉండవల్లి యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ ఒడ్డున ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయునికి పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో వేణుగోపాల స్వామి ఆలయంలోని దక్షిణముఖ ఆంజనేయునికి ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ విశేష పూజలు చేసి, శాంతి కల్యాణం నిర్వహించారు. కోదండ రామాలయంలోని ప్రసన్నాంజనేయ స్వామికి అర్చకులు రాజేంద్రశర్మ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మామిడి పండ్లతో అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. 113 త్యాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామికి అర్చకులు ప్రసన్నమూర్తి, రాజభట్టాచార్యులు, వేణు గోపాల మూర్తి, అజయ్‌బాబు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నాగవల్లీ దళాలతో సహస్రనామ పూజలు చేపట్టారు. వేమవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న అభయాంజనేయ స్వామికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు



విద్యార్థినికి నగదు ఇస్తున్న వివేకానందరెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్యుప్రెజర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని క్లబ్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఆయన సందర్శించారు. 4వ రోజు సుమారు 150 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. మరో రెండు రోజులు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆక్యుప్రెజర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపీ అందిస్తున్నట్లు వివరించారు. క్లబ్ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, జొన్నా రాజేష్, ట్రెజరర్ రామకృష్ణ శెట్టి, ప్రసాద్‌రెడ్డి, బుర్రముక్కు శ్రీరామ్, డాక్టర్ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్ నగర్‌కు చెందిన తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హిమబిందు అనే విద్యార్థినికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఓ ప్రైవేటు స్కూల్లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. డోలాస్‌నగర్‌కు చెందిన విద్యార్థిని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 400 మార్కులు సాధించిందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న హిమబిందుకి బుక్స్ కోసం రూ.9,500 అందజేసినట్లు చెప్పారు.

ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చైతన్య, నారాయణ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ కళాశాలల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. మంగళగిరి నియోకవర్గ ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి గౌరవ అతిథిగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల్లో విద్యా సంవత్సరం మొదలుకాక ముందే ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు. కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తే విద్యా సంస్థల ఎదుటే ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంగ్, గోపీ, అభి, ఏసు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సంఘం 'బాల్యమిత్ర' 8వ వార్షికోత్సవం



ఉత్తమ విద్యార్థులతో బాల్యమిత్ర సంఘీయులు

తెనాలి: స్థానిక తాలూకా బ్రాంచ్ హైస్కూలు పూర్వవిద్యార్థుల సంఘం 'బాల్యమిత' ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని అతిథి రెస్టారెంట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ వేడుకను జరుపుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. తాలూకా బ్రాంచ్ హైస్కూలు పూర్వవిద్యార్థులు 2016లో తొలిసారిగా కలుసుకున్నారు. నాటి సభలో తమ గురుదేవుళ్లను సత్కరించుకున్నారు. అప్పటి నుంచి ప్రతినెలా సమావేశాలు జరుపుతూ ఆర్థికంగా ఒకరికొకరు సహకారం అందించుకుంటున్నారు. మరోవైపు అందరి ఆర్థిక సహకారంతో వివిధ సేవాకార్యక్రమాలను చేపడుతున్నట్టు బాల్యమిత్ర అధ్యక్షుడు గద్దె శంకరరావు వెల్లడించారు. రాబోయే కాలంలో మరిన్ని సమాజ కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు టి.శరత్, ప్రధాన కార్యదర్శి ఏపీ పాండురంగారావు, ఆర్థిక కార్యదర్శి డి.లోకేశ్వరరావు, అన్నవరపు సురేష్, అంగిరేకుల ప్రసాద్, మల్లెల సత్యనారాయణమూర్తి, కలాం, ఎంఎస్సార్, తుంపూడి సత్యనారాయణ, అరుణప్రసాద్, అద్దేపల్లి కేశవరావు, మురళి, ఉదయభాస్కర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లిపడిన ఆనందం



1994-95 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

తాడికొండ: తుళ్ళూరు కేవీఆర్ జిల్లా పరిషత్ 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలనాటి విద్యార్థులందరూ ఒక చోట చేరి ఉపాధ్యాయులతో కలిసి గత స్మృతులను పంచుకున్నారు. తమను వీడి.. స్వర్గస్థులైన స్నేహితుల పేరు మీదుగా రెండు బీరువాలు పాఠశాలకు అందజేశారు. పూర్వ విద్యార్థి గంటా శ్రీనివాస్ లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. మరికొంత మంది విద్యార్థుల సాయంతో బెంచీలు అందిస్తామని తీర్మానం చేశారు. ఆర్మీ, నేవీలో, కోవిడ్ సమయంలో సేవలందించిన పాటిబండ్ల నరసింహరావు, జమ్ముల సతీష్, డాక్టర్ గంటా శ్రీనివాస్, నర్సు సియోను కుమారితో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నిర్వాహకులు నూతలపాటి కిషోర్, జెట్టి రమేష్, కొమ్మినేని శ్రీనివాస్, గూండా శ్రీను, మత్రి కిరణ్ కుమార్, మనోజ్ఞ, జ్యోతి, క్రిష్ణప్రియ పాల్గొన్నారు.

కిరాణ దుకాణం యజమానిపై దాడి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రైతు బజారులో కిరాణా దుకాణం యజమానిపై అదే ప్రాంతంలో నివాసముంటున్న వారు ఆదివారం దాడి చేయడంతో మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు మాధవరావు వివరాల మేరకు.. రైతు బజారులో మామూళ్లు వసూలు చేసే ఎస్టేట్ అధికారి రమేష్‌కు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తనపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఇటీవల జేసీ, ఏడీఎంకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. రైతు బజారులోని దేవా, అశోక్ అనే వ్యాపారులతో పాటు మరో వ్యాపారి దంపతుల సాయంతో తనపై, కుమారులు సోమేశ్వరరావు, వెంకట సుబ్బారావుపై దాడికి పాల్పడ్డారని చెప్పారు.

ఎస్టేట్ అధికారిపై ఆరోపణల వెల్లువ..

రైతు బజారు ఎస్టేట్ అధికారి జి.రమేష్ రైతుబజారులోని ప్రతి దుకాణదారుని నుంచి నెల నెలా మామూళ్ల వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. తాజాగా దుంపలు అమ్మే మహిళ నుంచి రెన్యువల్ ఫీజు పేరుతో రూ.20 వేలు తీసుకుని, రెన్యువల్ చేయకుండా దుకాణం ఖాళీ చేయాలని ఆమెను బెదిరించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం అందజేత..



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని బాధితులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అండగా నిలుస్తున్నారు. శృంగారపురం గ్రామానికి చెందిన నలుగురు బాధిత కుటుంబాలకు ఆయన అందించిన రూ.60 వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ ఆదివారం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘంటసాన వెంకట రత్నం, అనారోగ్యంతో చనిపోయిన రెడ్డి నాగేశ్వరరావు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన శృంగారపాటి జల్సన్, బ్లడ్ క్యాన్సర్‌తో మరణించిన శృంగారపాటి చక్రవర్తి కుటుంబ సభ్యులకు రూ.15 వేలు లెక్కన అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కేకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ కొండూరు సుధారాణి, ఎంపీటీసీ కూచిపూడి సురేష్, ఉప సర్పంచ్ ఉయ్యూరు రాజేశ్వరి, మార్కెట్ యార్డు చైర్మన్ ఉప్పాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శృంగారపాటి రత్నం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కలిసేటి బోస్, శృంగారపాటి విజయ్, ప్రాతూరు బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత..

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామానికి చెందిన అమర్తలూరి సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును ప్రకటించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడి కుటుంబానికి అందజేశారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పూజలు చేస్తున్న కత్తెర సురేష్ కుమార్

మేడికొండూరు: డోకిపర్రు గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అన్నదానం సందర్భంగా భోజనం వడ్డించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, బీవీ సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, ఎంపీటీసీ కొలకలూరి నాగేశ్వరావు, ఉడతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని సందర్శించిన కత్తెర



కాలనీలో అధికారులతో చర్చిస్తున్న కత్తెర సురేష్ కుమార్

ఐనవోలు(తాడికొండ): తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీని ఆదివారం తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సందర్శించారు. కాలనీలో రోడ్లు, స్థలాల పనుల పురోగతిని తెలుసుకున్నారు. సీఆర్డీఏ చట్టంలో పొందుపరచిన విధంగా పేదలకు రాజధానిలో వసతి కల్పించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పేదలను అణగదొక్కి కేవలం ఓ వర్గానికే ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో చంద్రబాబు నాయుడి అరాచకాలకు చెక్ పడి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

డాక్టర్ అయినంపూడికి సత్కారం

తెనాలి: ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సభలో 'రాజకీయాల్లో అన్నగా ఎన్టీఆర్' అనే అంశంపై డాక్టర్ పుల్లేటికుర్తి ఎస్.వి.శ్రీనుబాబు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. మానసిక వైద్యుడు, మధుర గాయకుడు డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబును సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, కంచర్ల ఏడుకొండలు, కంచర్ల నాగభూషణం, దంతాళ ప్రేమ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.